**కథ**

# "సరోజా, ఏయ్ సరోజా, కంగ్రాట్యులేషన్స్."

# "థాంక్యూ" గంటు పెట్టుకున్న మొహంతో జవాబిచ్చింది సరోజ.

# అపరాజిత

''అదేంటే, నీది నార్మల్ డెలివరీయే గదా, ఇంకా నొప్పిగానే వుందా. మీ అత్తగారు నర్సింగ్ హోమ్ వాకిట్లోనే కనబడ్డారు. చాలా సంతోషంగా వున్నారు మనవడు పుట్టాడని. ఆవిడే చెప్పారు నీది నార్మల్ డెలివరీ అని, బాధలేం లేవని, బాబు చాలా ముద్దుగా వున్నాడనీ.''

''చెప్పేవుంటారు. చెప్పరూ మరి. ఇంకా ఏం చెప్పారు. బాబు అంతా తన కొడుకు మాదిరేనని చెప్పారా లేదా. బాధలేం లేవట. అమ్మయితేగా అర్థం చేసుకోవడానికి, అత్తగారైపోయె. ఎలా అర్థం అవుతుంది నా బాధ.''

''ఇంత ఫీలయిపోయేదానివి అమ్మ దగ్గరకే పోలేకపోయావా.''

''నాకూ పోవాలని ఎంతగానో వుండేదే. అమ్మ కూడా పిల్చుకెళ్తానని వచ్చింది. కానీ మా ఆయన పడనిస్తేనా మా అమ్మావాళ్లది పల్లెటూరట. డ్వాక్టరు వసతులు సరిగా లేవట. అక్కడికి ఈయన నగారి కొక్కరికే కొడుకు పుడుతున్నట్లు, ఒకటే గొడవ. ఆ పల్లెకు పంపనే పంపను మీ అమ్మనే రమ్మను అని. అయినా మా అమ్మ ఇక్కడే వుంది గదా. మొన్ననే మా చెల్లెలు రమ పురుడు పొయ్య లేదా, ఎంత అపురూపంగా చూసుకోలేదూ. అందులోనూ పుట్టబోయేది మన వంశోద్ధారకుడాయె. ఇంకెంత ముద్దుగా చూసుకుంటుందో అని ఒకటే పట్టు. ఆవిడా కొడుకు ముందు అలాగే వంత పాడిందనుకో. ఇప్పుడు మాత్రం ఆయన కనుమరుగైతే చాలు ఒకటే దెప్పుతోంది. 'కూతురుకైతే తప్పని సరి అది మా డ్యూటీ. కోడలుకూ నేనే చావాలా, ఏం వాళ్ళమ్మకేమయిందీ' అంటూ వచ్చిన వారందరితో చెప్పుకుంటోంది. మా అమ్మేం పురుడు పొయ్యననలేదుగా. ఈ గొడవలన్నీ ఆయనకు తెలియవు. తెలిసినా ఆయన ఇప్పుడు ఇంకొకటి పట్టించుకునే స్థితిలో లేరు. ఆ కొడుకును తప్ప''

''ఈ గొడవలన్నీ వుండేవే కానీ ఏడీ వంశోద్ధారకుడు''

''అడుగో వచ్చేశాడు. ఇప్పుడే స్నానం చేయించినట్లున్నారు. ఎవరి మాదిరి వున్నాడంటావ్''

''అచ్చు నీ పోలికే. స్నానం చేసి ఏడుస్తున్న వాడి మొహం అచ్చు నీ మొహంలాగే వుంది''

''నీకెప్పుడూ జోకులేనే.''

''మళ్ళీ వస్తాలే. సుధను కూడా చూసి, దాని ఏడుపులేవో విని.''

''నీ జోక్సంకేం గానీ దాన్నీ రమ్మనవే. నేనిప్పుడప్పుడే బయటకి వెళ్ళడానికి వీలు పడదు. నాకూ దాని కూతుర్ని చూడాలని వుంది''

''నీ కొడుక్కన్నా మూడు నెలలు పెద్దదికదే అది. కోడల్ని కూడా చేసుకోలేవు పాపం. నీ కొడుకు మాత్రం మన్మధుడిలా వున్నాడు. వాడికేం పేరు పెట్టాలో ఆలోచించు. మిగతా ఆలోచనలన్నీ మానేసి సంతోషంగా వుండు. మళ్ళీ వస్తాగా.''

సుధ ఇంటికి వెళ్ళాను. వాకిట్లోనే ఎదురొచ్చింది సుధ. ఇంకా బాలింతరాలేనేమో కొంచెం వళ్ళు చేసి ఒక వింత మెరుపుతో కళకళలాడిపోతూ వుంది. కానీ దాని మొహంలోనూ సంతోషం ఛాయలు తక్కువగానే వున్నాయి.

''ఏంటీ విశేషాలు?''

''నా విశేషాలకేంగానీ ఏదీ రాజకుమారి. మా సుధంత అందగత్తేనా''

''అది నువ్వే చెప్పాలి. అయినా దానికేం అది బాగానే వుంది. అందరి అటెన్షను దానిమీదే గదా.''

''కూతురిని చూసి కూడా అసూయపడతావా ఏంటి. ఏం ఇంతకీ నీ మీద అటెన్షన్ తగ్గిందనేనా ఈ రుసరుసలు.''

''ఆ అదేం కాదు ఈయనే..''

''ఏంటి మీ ఆయన కూడా కూతురు మోజులో పడి నిన్ను మరిచిపోయారా సరోజా వాళ్ళాయనలాగా.''

''నీవన్నీ జోకులకింద కొట్టేస్తావే. నేనేమో కాన్పుకు అమ్మ దగ్గరికి పోను ఇక్కడే వుంటానని, అమ్మ దగ్గరైతేనే నాకు అన్ని విధాలా బాగుంటుందని ఆయన, వాదించుకొని చివరికి అమ్మ దగ్గరకే వెళ్ళాల్సి వచ్చిందిగదా. అన్ని పుస్తకాల్లో చదువుతున్నాము కదా కాన్పు టైములో భార్యాభర్తలిద్దరు దగ్గరే వుంటే మంచిదని, అమెరికాలోనైతే పురిటి గదిలోనే వుంటాడట భర్త కూడా. ఇప్పుడు చూడు ఏమైందో, ఈ బుడత మూణ్ణెల్లదయ్యే వరకూ ఈయన చూడనేలేదు కదా. అంతలో ఎంతమందో దీన్ని చూశారు. ఏదో కోన్కిస్కా అన్నట్లు, ఇన్నాళ్ళకు ఈయన చూశారు.''

''నాకేమో ఇది చాలా కొరతనే. మన సరళ సంగతి విన్నావుకదా, అది అదృష్టవంతురాలే. పెళ్ళికాగానే అమెరికాకు వెళ్ళిపోయిందా. అమ్మను కూడా అక్కడికే పిలిపించుకుందట. కాన్పు టైములో ఆనందం పంచుకోవడానికి ఆయన అన్నీ అమర్చడానికి అమ్మ. అదృష్టమంటే దానిదేనే. ఈ విషయం తెలుసా, కాన్పు టైములో వాళ్ళాయన ఆ రూములోనే వున్నాడట. నువ్వింకా అకౌంటు మొదలు పెట్టలేదు గదా. హాయిగా అమెరికా వెళ్ళి అక్కడే కనవే పిల్లల్ని. అన్నీ అడ్వాన్‌టేజసే అక్కడ కంటే. పిల్లలకు అమెరికన్ సిటిజన్‌షిప్ కూడా వస్తుంది. ఏమైనా చెప్పు మన సరళ అదృష్టవంతురాలే.''

''నువ్వే అనుకోవాలా అట్లా. నాలుగు రోజుల కింద సరళా వాళ్ళమ్మ వచ్చారని తెలిసి వెళ్ళాను''

''నీ పనే బాగుందే హాయిగా అందర్నీ చూసి వస్తున్నావు. ఏం నువ్వింకా ఏమీ అనుకోలేదా''

''నా సగంతి అటుంచు గానీ సరళ సంగతి విన్నావా, నువ్వేమో కాన్పు టైములో మొగుడు పక్కనుంటాడని మురిసిపోతున్నావుకానీ అదేమో ఇవేం పాడు వేషాలు. ఇక్కడ కూడా ఈయన వుండాలా అని తెగ విరుచుకుపడిందట. అంతేకాదు అమ్మను కూడా ఆ రూమ్ లోనే వుండమన్నాడట అల్లుడు. ఆమైతే సిగ్గుతో చితికిపోయానని చెప్పింది. అవ్వ, చెప్పుకుంటే సిగ్గుచేటు అదంతా వీడియో, ఫొటోలు తీశాడు. అంతటితో ఆగాడా ఆ ఫోటోలు ఫ్రెండ్సుకు చూపిస్తాడట. రేపు అది ఏ మొహం పెట్టుకొని ఆ ఫ్రెండ్సు ముందుకు పోతుంది. అయినా దీనికెందుకమ్మా వీడియో ఫొటోలు. ఏ పెళ్ళో పేరంటమో అయితే నలుగురికి చూపించుకున్నా అందం, చందం. ఇది ఒకరికి చూపించుకునే ముచ్చటా, కలికాలం కలికాలం, అన్నీ పిదప బుద్ధులు ఆ అమెరికాలోనైతే మరీనీ'' అని ఈవిడ ఒకటే వాపోయింది.

''మన నలుగురు ఫ్రెండ్స్‌లో మీరు ముగ్గురు యేడాది లోపే కనేశారు. నేనేమో రెండేళ్ళు గాప్ అనుకున్నాను. మిమ్మల్నిద్దరినీ చూసి సరళ సంగతి విన్నాక ఇంకా బాగా ఆలోచించిగానీ


డిసైడ్ కాలేననిపిస్తోంది. అయినా ఎవ్వరికీ వున్న దానితో తృప్తిలేదుకదా! నీకేమో కాన్పు టైముకు ఆయన దగ్గర లేడన్న బాధ, సరోజకేమో ఆయన దగ్గరున్నా అమ్మ దగ్గరికి పోలేదని బాధ, సరళది ఇంకో రకమైన బాధ. ఇవన్నీ చూస్తే అసలు కాన్పే వద్దనిపిస్తోందే నాకు.''

అన్యమనస్కంగా వున్న నన్ను చూసి మరో రకంగా అర్థం చేసుకున్నారు మావారు. ''ఏం నీకూ పిల్లలు కావాలనిపిస్తోందా, మీ స్నేహితుల పిల్లలను చూసేసరికి. నావైపు నుంచి ప్రాబ్లమ్ లేదు. నీవే రెండేళ్ళు హాయిగా వుందామన్నావు గదా''

''ఇప్పుడూ నాది అదే మాట. కాకపోతే వీళ్ళ వాలకం చూశాక అసలు పిల్లలు కావాలా వద్దా అని ఆలోచనగా వుంది'' అంటూ నేను విన్నదంతా చెప్పాను ఆయనతో.

''ఇందులో పిల్లల దోషమేముందో చెప్పవోయ్. అన్నీ మనం చేజేతులా చేసుకున్నవే గదా. సరోజ కాన్పు పల్లెలోనయితే యేమవుతుందోనని భయపడ్డవాళ్ళాయన వాళ్ళకు నచ్చచెప్పాలి. కాన్పయ్యాక తల్లిగారింటికి పంపించేస్తే సరి. దానికి ఇంత రాద్ధాంతం ఎందుకు చెప్పు. సుధను నేనెప్పుడు సుద్ద అని ఎందుకంటానో తెలిసిందా. మన పద్ధతుల ప్రకారం తల్లిగారింట్లో పురుడు పోసుకోవడం ఆనవాయితీ. అంతగా కావాలంటే ఆ టైముకు ఆయన్ను పిలిపించుకోవలిసింది గుట్టుగా. ఇదంతా వాళ్ళత్తగారి వాళ్ళకు తెలియవలసిన పనేముంది. ఇక సరళంటావా, అమెరికా అమెరికా. అని గెంతులేసిందిగానీ ఆ అబ్బాయి మంచీ చెడూ విచారించను కూడా విచారించనియ్యలేదు కదా. ఇప్పుడు విచారించి ఏం లాభం. అతని అభిప్రాయాలను నెమ్మది నెమ్మదిగా మార్చుకోవాలి. లేకుంటే తానే అడ్జస్ట్ అయిపోవాలి. ఇక మన సంగతంటావా నువ్వు దిగులు పడి పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసు పాడు చేసుకోకు. ఆ టైమ్ వచ్చినప్పుడు మనిద్దరం కలిసి ఆలోచించి మనకు నచ్చినట్టుగా చేద్దాం. సరేనా. అయినా కాన్పు అనేది ఆడదానికి పునర్జన్మ అంటారు. మరి మగవాడి జీవితంలో దానికేం విలువ లేదంటావా. తమ వంశాంకురాన్ని ఈ లోకంలోకి తేవడానికి తన సహచరి పడుతున్నబాధ అతనినేం బాధించదనుకోవడం న్యాయమేనా? నువ్వు ఈ తలతిక్క ఆలోచనలన్నీ మానేసి, అసలు విషయంలో ఏమైనా కొంత కన్సెషన్ ఇస్తావా చెప్పు. ఇంక మీదట మనం ఆ ప్రయత్నంలోనే వుందాం. ఏ సమస్యకైనా పరిష్కారం మన చేతుల్లోనే వుందోయ్. కాదంటే భార్యాభర్తలిద్దరు ఒకరి అభిప్రాయాన్ని ఒకరు గౌరవిస్తూ, కలిసి మాట్లాడుకొని ఏదైనా నిర్ణయం తీసుకోవాలి. స్థలం ముఖ్యం కాదోయ్ మన చుట్టూరా వున్న వాతావరణం ముఖ్యం. పుట్టిల్లయినా అత్తిల్లయినా ఆనందంగా వుండడం ముఖ్యం. కాలంతోపాటు కాన్సెప్ట్సు మారిపోయాయి. భర్త దగ్గరగా వుండడమే ముఖ్యంగా భావిస్తున్నారు ఇప్పుడు. ఆ కాలంలో ఇన్ని పుస్తకాలు లేవు. ఇంత ఓపెన్‌గా మాట్లాడుకోడాలు లేవు. పైగా వయసు కూడా చిన్నదవడంతో ఏమీ తెలిసేదికాదు. అందుకని భార్యాభర్తలను దగ్గరగా వుంచితే మళ్లీ త్వరగా కాన్పు వస్తుందేమోనని భయం. ఇప్పుడటువంటి ప్రాబ్లమ్స్ లేవుకదా అయినా నీ పేరులోనే వుందిగదా నీకు పరాజయం లేదని నువ్వు నిశ్చింతగా వుండు'' భర్త మాటల్లో ఎంత నిజం వుందో అర్థమై తేలికైన మనసుతో సరోజ బాబును, సుధ పాపను తలుచుకుంటూ ఏవేవో కమ్మని కలల్లో తేలిపోయింది అపరాజిత.






**విరూరు రుక్మిణి**